# అపుత్రస్యగతిర్నాస్తి

తాత కృష్ణమూర్తిగారు బి.ఏ., యల్.టి.

వెంకోబరావుపంతులు చాలా సరదామనిషి. అతనికల్లా ఒక్కటే దుర్వ్యసనం ఉండేది. విధివిరామం లేకుండా చుట్టలుకాల్చేవాడు. కాని కొన్నాళ్లకు పెళ్లాంపోరు పడలేక ఆమెకు వాగ్దానంచేసినాడు 'పొగ చుట్టలుమరికాల్చను!' అని.

చుట్ట, పొడుం, నల్లమందు—ఇట్లాంటివ్యసనాలు అభ్యాసంకాకనే పోవాలి. ఒకమాటు వాటికి అల వాటుపడితే ఇకపూర్తిగా వదలించుకోవడమనేది సాధారణంగా......అసాధ్యం.

వెంకోబరావుపంతులును వెయ్యికళ్లతో కనిపెడుతూ ఉండేది ఆయనభార్య. "ప్రమాణంచేసిన పెద్ద మనిషికదా, మాటతిరుగుతారా?" అని భర్తనునమ్మి ఊరుకునే యిల్లాలుకాదు ఆమె. ఇంట్లో మారుమూల లన్నీ వెదికి యెక్కడెక్కడవున్న పొగాకుముక్కలు సంగ్రహించి పెనిమిటి కవిచిక్కకుండా చేసేది.

భార్యకులొంగినట్టే ఉండేవాడుకాని పంతులు నేర్పుతో ఆమెను మోసంచేయడం ప్రారంభించినాడు. సర్కారుఉద్యోగి అనిచెప్పి మాటికీచీటికీ కమాను బయలుదేరేవాడు—పెళ్లాం కంటమాత్రం పడకుండా వుంటే యెన్నిచుట్టలుకాల్చినా అడిగేవారులేరుకదా అని ధైర్యం. సర్వ్యూటులో ఉన్నప్పుడు శబరిలంక పొగాకు వీశెలకువీశెలు సంపాదించి చుట్టలుచుట్టించి భద్రంగా దాచుకునేవాడు ఆఫీసుపెట్టెలో. ఒకసారి గ్రహచారవశాత్తూ పెట్లోచుట్టలకట్టలు ఉన్నసంగతి భార్యకుతెలిసింది. "ఎక్కడివీ చుట్టలు?" అని ఆమె నిలవదీసేసరికి పంతులుముఖం వెలవెలబోయింది. క్షణం ఆలోచించి చిన్నచిరునవ్వుతో "చుట్టలుకాల్చడం మానుకున్నా నాప్రారబ్ధంచేత వాటినిసంగ్రహించి మోసుకొనిరావడం తప్పలేదు. ఈఅధికార్లవ్యసనాలు కని పెట్టి యెవడికియేది మక్కువయితే అదిజాగ్రత్తపరచి వాడికి సమర్పించాలి. క్రిందటియేడు బ్రాందీబుడ్లు సప్లయి చేసేసరికి యిల్లుగుల్లయింది. ఇప్పుడువచ్చిన ఆఫీసరు కొంతనయమేఅనుకో. శబరిచుట్టలతో తృప్తి పొందుతాడు. ఎంతోశ్రమపడి యీచుట్టలన్నీచుట్టించినాను. రేపుప్రొద్దున్నే బంట్రోతుచేత పట్టించుకొని బంగాళాకు పోవాలి." అని సమాధానంచెప్పినాడు.

పాపం ఆమె నమ్మకున్నది. పంతులు తనలోనవ్వుకున్నాడు. వెనుకటివలెకాక చుట్టలిప్పుడు రహ స్యంగాకాల్చవలసి వచ్చినందున యీపాడువ్యసనం కొంతతగ్గివుంటుందని అనుకోకూడదు. పూర్వంకన్న అధి కంగాకాల్చేవాడు. దొంగతనంగాచేసే వ్యసనాలకు తృప్తిఅనేది కొఱత!

పంతులుపూర్వం యిల్లుదాటి యెక్కడికీ వెళ్లేవాడుకాడు. ఇప్పుడు యింట్లోస్థిరంగా ఒకగంట నిల వడంఅరుదు. స్నేహితులయిండ్లలోను క్లబ్బులోను షికారుస్థలాల్లోను—యెక్కడో చుట్టకు అటంకంలేనిచోట కాలం వెళ్లబుచ్చేవాడు. కొత్తగా తమలపాకులు కూడా తరుచుగా నములడం అలవాటు చేసుకున్నాడు చుట్టకంపుకప్పి పుచ్చడానికి. చుట్టలకు బదులు పాపం కిళ్లీలతో తృప్తిపొందుతున్నాడు కదా అని భార్య సంతోషించింది. క్రమంగా ఖారాకిళ్లీలు ప్రారంభించినాడు. పెళ్లాం అభ్యంతరపెట్టలేదు. బజారు మసాలా యింపుగాలేదనిచెప్పి, బరంపురంనుంచి సుబుద్ధిమసాలా తెప్పించేవాడు. కిళ్లీ సామగ్రియావత్తు యింట్లోనే జతపరచి ఖారాకిళ్లీలు చుట్టడం భార్యకు నేర్పినాడు. పెళ్లాం చూస్తూవున్నప్పుడు కిళ్లీ, ఆమె చూడనప్పుడు చుట్ట యీవిధంగా కిళ్లీమీదచుట్ట, చుట్టమీదకిళ్లీ, ఒకొక్కప్పుడు కిళ్లీనములుతూనే చుట్ట—ఈవిధంగా కొన్నాళ్లు గడిపినాడు.

ఒకనాడు చాకలిదానికి బట్టలువేస్తూవున్నప్పుడు పంతులుజేబులో పొందికగా మడతపెట్టివున్న పొగాకుకట్ట దొరికింది అతనిభార్యకు. భర్తవీధిలోనుంచి యింటికిరాగానే అడిగింది: "ఏమండీ మళ్లీ చుట్టలు ప్రారంభించినారూ? మీకోటుజేబులో పొగాకుకట్ట దొరికిందినాకు. దొంగతనంగా చుట్టలుచుట్టుకొని కాలుస్తున్నారా యేమిటి?"

నవ్వుతూ పంతులు "అబ్బే లేదు. డబ్బాలో మసాలాఅయిపోయింది. రావలసినబంగీ యింకా పురంనుంచి రాలేదు. ఈలోపున రెండుమూడురోజులకు సరిపోయే మసాలా, బజారులో కొనుక్కున్నకంటె మనమే తయారు చేసుకోకూడదా అనుకున్నాను. కొట్లమీద దొరికే ఖారామసాలా కలగాపులగంగా వుంటుంది. రేపుప్రొద్దున్న ఆపొగాకు యెండలోపెట్టివలిపి గుండచెయ్యాలి. చుట్టలకైతే యీపొగాకు పనికి వస్తుందా? అదిగాక యీకాస్తపొగాకు చుట్టలకేం సరిపోతుంది? దీనిని నోటిపొగాకంటారు. కేవలం మసాలా చేసుకుందుకు తప్ప మరిదేనికీ పనికిరాదు. నీధర్మమా అని నాకిప్పుడు చుట్టమీదికి మనసుపోవడం లేదు. కొత్తరికం కొంచెం కష్టంగా ఉండేది. కాని యిప్పుడుచుట్టమీద యేమీకోరిక లేదు. చుట్టలు కాల్చమని నువ్విప్పుడు బ్రతిమాలినా కాల్చను." అన్నాడు.

మాటనిలబెట్టుకుందుకు పంతులు మర్నాడు ధనియాలు, సోపు, గసగసాలు అన్నీ తెప్పించి అవిభార్యను మూకుట్లోవేచమని ఆమెకళ్లయెదుట పొగాకంతావలిపి గుండచేసి ఖారామసాలా తయారుచేసినాడు.

మరికొన్నాళ్లకు యింట్లో మళ్లీ పోరుప్రారంభించింది. పొగాకు యేరూపంలోను కూడా వాడరాదని పంతులుభార్య నిర్బంధించింది. తాంబూలానికిమాత్రం ఆమె అభ్యంతరం చెప్పలేదు. కాని ఖారాకిల్లీ, చుట్ట—ఈరెండింటికీకూడా ఆమె వొప్పుకోలేదు. విధిలేక సరేనన్నాడు పంతులు.

అదిమొదలు బహుజాగ్రత్తగా అతిరహస్యంగా కాల్చుకునేవాడు చుట్టలు. ఇంట్లోయెక్కడాపొగాకు ముక్కగాని చుట్టకాని భార్యకంటపడకుండా జాగ్రత్తపడేవాడు పంతులు.

కాని 'ప్రమాదో ధీమతామపి' అన్నారుపెద్దలు. ఎంతకట్టుదిట్టంమీద కథనడిపిస్తూవున్నా ఒక్కొక్కప్పుడు చిక్కులలో పడుతూవుండేవాడాయన. ఒకనాడు దుస్తులు విప్పుకుంటూవున్నప్పుడు ఆయన చొక్కాజేబులోవున్న పొగాకుకట్ట జారిక్రిందపడింది. పాపం పంతులది కనిపెట్టలేదు.

మరికొంతసేపటికి పంతులుకొడుకు—పదిపన్నెండేళ్ల కుర్రవాడు—గదిలోకి యెందుకోవచ్చినాడు. నేలమీదపడివున్న పొగాకుకట్ట కనిపించింది. తీసి చేతపట్టుకున్నాడు. ఇంతట్లో పంతులుభార్య అక్కడికి రావడం తటస్థించింది. కొడుకుచేతిలో పొగాకుచూపింది. ఆమెకు కోపంముంచుకొచ్చింది పంతులు మీద. కొడుకుచెయ్యిపట్టుకొని గదిలోనుంచి కేకవేసి పెనిమిటిని పిలచింది.

పంతులు గదిగుమ్మంలో అడుగుపెట్టేసరికి "ఏమండీ! నేనెంత నెత్తీనోరూ కొట్టుకుంటున్నా మీరు మీగుణం మానరుకదా? ఈపొగాకుకట్ట వీడికెట్లా దొరికింది? మీజేబులోనుండో మొలనుండో క్రిందజారి పడివుంటుంది. అంతేనా?"అని తీక్ష్ణంగా అడిగింది.

భార్య కూకలకు గురికాకుండా తప్పించుకునే ఉపాయం పంతులుకు యేమీతోచలేదు. కొంతసేపు తటపటాయించి మరో ఆలోచన యేదీతోచనందున లేనికోపం తెచ్చుకొని కళ్లెఱ్ఱజేసి కొడుకువేపు తిరిగినాడు. "ఓరి కుంకవెధవా! దౌర్భాగ్యుడా! గాడిద!...నీకీపాడుబుద్ధి యెట్లా పుట్టిందిరా? జానెడువెధవవు! అప్పుడే నువ్వు చుట్టలుకాల్చడానికి సిద్ధపడుతున్నావా? ఎవడు నేర్పినాడురా నీకీ దౌర్భాగ్యపుపని?......


314

నువ్వూ, నీ చెడుబుద్ధులూను!... బొత్తిగా భయంలేక....... సిగిరెట్లు, చుట్టలు యిదా నీ చదువు? పుస్తకంమీద వుండవలసిన ధ్యానం పొగాకుమీదికి పోతూవుందేం?" అంటూ గొంతుక చిగిలేటట్లు గట్టిగా అరుస్తూ వీరావేశంతో ఉగ్రనరసింహమూర్తివలె కొడుకుమీద తిరగబడి జుత్తుపట్టుకొని, పళ్లుకొరుకుతూ, గభీగభీమని రెండుగుద్దులు గుద్ది "ఈమాటు నాకంటపడనీ చెప్తాను!" అని భార్యచేతిలోవున్న పొగాకుకట్ట లాగుకొని రోడ్డుమీదికి విసిరేశాడు.

పంతులుభార్య తెల్లబోయి చూస్తూనిల్చుంది. కొడుకు వెక్కివెక్కి యేడుస్తూవుంటే ఆమెకుకూడా దుఃఖం ముంచుకొచ్చింది. కుర్రవాడిని చేరదీసి శిరమునిమిరి ఓదార్చింది. పంతులుచేసిన గడబిడకు నిజంగా కొడుకుదే నేరం కాబోలని ఆమె నమ్ముకున్నది.

ఈ ముచ్చట జరిగిన పిమ్మట, మళ్లీ యింట్లో యెక్కడైనా చుట్టపీలికగాని, పొగాకు ముక్కగాని, ఖర్మంచాలక ఆమెకంట పడినప్పటికీ కొడుకే వీటికి కారణమనుకొని భర్తను గద్దించడం మానివేసింది. పడీ చప్పుడులేకుండా అవస్తువసంగ్రహించి పెనిమిటికి తెలియకుండా అవతల పారవేసేది. కొన్నాళ్లవరకూ యీ విధంగా తండ్రిపాపాలు కొడుకును చుట్టుకొని వెంకోబరావు పంతులును కాపాడగలిగినవి.

పంతులొకనాడు తన మిత్రులతో యీముచ్చటంతా చెప్పడం ప్రారంభించినాడు.

"బాగానేవుంది కాని పాపం నిష్కారణంగా కుర్రవాడినికొట్టి బాధించినారే?" అన్నారుకొందరు.

నవ్వుతూ పంతులందుకు సమాధానంచెప్పినాడు: "అందుకనే పశ్చాత్తాపం కలిగి అమర్నాడే వాడికొక చిన్నబైసికిలు కొనియిచ్చి తప్పుదిద్దుకున్నాను.........కాని, వాడుకూడా తక్కిన ముద్దరివలె ఆడపిల్లగా పుట్టివుంటే యెంతచిక్కులో పడిపోయివుందునో ఆలోచించకుండా ఉన్నారు మీరు. ఒక్కడైనా కొడుకంటూవున్నాడు గనుక సరిపోయింది. అందుకనే మనవాళ్లు మొగపిల్లలకోసం దేవులాడుతారు. 'అపుత్రస్య గతిర్నాస్తి' అన్నవాక్యం మనపూర్వులు కేవలం స్వానుభవం మీదవ్రాసివుంటారు. చేతికందిన కొడుకు ఉన్నాడంటే గృహస్థున్నవాడికి చుట్ట కాల్చుకుందుకు యెంత సదుపాయంగా వుంటుందో ఆలోచించండి."

## సరస్వతీస్తోత్రము

శ్రీమతులు గిడుగు లక్ష్మీకాంతము జొన్నలగడ్డ శారదాంబగార్లు

చ. కరుణనుజూడుమమ్మ మము, గాఢపుకూర్మిని గావుమమ్మ, మా
వరుసగుణాకరీయనుచు వారకసేవలుచేతుమమ్మ, నీ
వరసురలోకమమ్మెపుడునాదరమొప్పగ జూడుమమ్మ, ఓ
పరమదయాకరీ! సుజనపావని! మానిని! భారతీమణీ!

ఉ. చక్కనిచుక్కవోగదవె, చల్లనితల్లి! కృపామతల్లి! నన్
మక్కువజూడగాగదవె, మంజులవాగ్విభవంబునీగదే,
చక్కనిభావయుక్తపదసారభశోభితశోభనీగదే,
వాక్కులశ్రేణి! వీణకరపల్లవపాణి! సుమంజుభాషిణీ!